ప్రజాశక్తి
సోమవారం 8 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం



రైతు సమస్యలపై నేడు డయల్ యువర్ కలెక్టర్



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎరువుల విషయంలో రైతుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సూచనలు, సలహాలు స్వీకరించేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య 08942 222565 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందని పేర్కొన్నారు.

కలగానే జెట్టీ..!

ఆశగా ఎదురు చూస్తున్న మత్స్యకారులు

వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు-మంచినీళ్లపేట తీరం మధ్య జెట్టీ నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న జెట్టీ పనులు నిలిచిపోవడంతో సరైన ఉపాధి అవకాశాలు లేక పెద్దఎత్తున మత్స్యకారులు వలసబాట పడుతున్నారు. కూటమి ప్రభుత్వం జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటే స్థానికంగానే జీవనం సాగించవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిన జెట్టీ పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండలం నువ్వల రేవు-మంచినీళ్లపేట ఉప్పుటేరు తీరం వద్ద వైసిపి హయంలో సుమారు రూ.12 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (టీ జెట్టీ) నిర్మాణానికి 2020లో అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శ్రీకారం చుట్టారు. మత్స్యశాఖ ఆధ్వర్యాన భారీ నీటిపారుదల శాఖ పర్యవేక్షణలో నిర్మాణం చేపట్టారు. మొదట దశ పనుల్లో భాగంగా తొలుత ఇసుక దిబ్బలు చదును చేసి కంకర పరుపు పనులు పూర్తి చేశారు. ఆ తరువాత సిమెంట్ పలకలు వేసి వదిలేశారు. కొంతకాలం గడిచాక ప్రహరీ నిర్మించి ఉప్పుటేరుని అనుకొని రాళ్ల పరుపు, గ్రావెల్‌తో భూమట్టం ఎత్తు పనులు చేశారు. ప్లాట్‌ఫారం, భవనాలు సముద్రం నుంచి పడవలు రాకపోకలు సాగించడానికి లంగరు వేయడానికి డీప్ వాటర్ పనులు చేపట్టకుండా వదిలివేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 17 నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో జెట్టి నిర్మాణం కలగానే మిగిలిపోయిందని మత్స్యకారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుదీర్ఘంగా 193 కి.మీ. తీర ప్రాంతం ఉంది. 11 మండలాల్లో 104 గ్రామాలున్నాయి. సుమారు 4,200 ఇంజిన్ బోట్లు, నాటు తెప్పలు, పడవలపై సుమారు 15 వేల మంది మత్స్యకారులు చేపలవేట సాగిస్తున్నారు. పరోక్షంగా మరో లక్ష మందికి పైగా జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలో అత్యధికంగా చేపల వేట సాగిస్తున్న గ్రామాల్లో వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ల పేట ఒకటి. ఇక్కడ సుమారు 90 మర బోట్లు, 150 వరకు నాటు తెప్పలున్నాయి. జెట్టీ, హార్బర్ వంటి సదుపాయాలు లేకపోవడంతో మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చలేకపోతున్నారు. కెరటాల అవతలే లంగరు వేస్తున్నారు. అక్కడి నుంచి మరో నాటు తప్ప ద్వారా తీరానికి చేరుకుంటున్నారు. వేట సాగని సమయంలో, తుపాను హెచ్చరికల వేళ ఉప్పుటేరులో లంగరు వేసి భద్రపరుచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జెట్టీ అందుబా టులోకి వస్తే రాత్రి, పగలు సులువుగా వేట సాగించే అవకాశం ఉంటుంది. వేట సామగ్రి భద్రపరుచుకోవచ్చు. చేపల రవాణాతో మంచి లాభాలు పొందొచ్చు. తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో ఇబ్బం దులు పడకుండా జెట్టి వద్దకు త్వరగా చేరుకోగలరు.

అంగన్వాడీల వేతనాలు పెంచకుంటే సమ్మె

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు



ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగమణి

ప్రజాశక్తి - ఆమదాలవలస

అంగన్వాడీలకు వేతనాలు పెంచకుంటే మరో సమ్మె పోరాటానికి సిద్ధమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకు 42 రోజుల సమ్మె పోరాటం సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సమ్మె పోరాట శిబిరాలకు టిడిపి కూటమి నాయకులు వచ్చి అధికారంలోకొస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంచుతామని హామీనిచ్చారని గుర్తుచేశారు. అంగన్వాడీలకు వేతనాలు కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి, రాష్ట్రంలో 2019 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీలకు డిఎ, పిఆర్‌సి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. అంగన్వాడీలకు యాప్‌ల భారం పెంచడం వల్ల ప్రీస్కూల్‌కు ఇబ్బంది అవుతోందని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు గౌరవాధ్యక్షులుగా పొన్నాడ భూలక్ష్మి, అధ్యక్షులుగా బి.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా పంచాది లతాదేవి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా కె.నాగరత్నం, ఎ.అరుణ, సనపల రమణమ్మ, కంచరాపు మాధవి, బాడాన ఉమ, జె.జ్యోతి, పి.సునీత, కె..రామలక్ష్మి, ఎ.రేణుక, జి.ప్రసన్న రాణి తదితరులను ఎన్నుకున్నారు.

మందస : సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కదలాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జె.హేమలత, పి.ఉమాలక్ష్మి పిలుపునిచ్చారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు మహాసభను స్థానిక అన్నపూర్ణమ్మ గుడి ఆవరణలో ఆదివారం నిర్వహించారు. అంగన్వాడీలకు ఆన్‌లైన్ వర్క్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలని, సెంటరు నిర్వహణకు నాణ్యమైన ట్యాబ్‌లు, 5జి నెట్ ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు అధ్యక్షులుగా జె.హేమలత, కార్యదర్శి పి.ఉమాలక్ష్మి, కమిటీ సభ్యులుగా టి.నాగేశ్వరి, సునీతపండా, తులసి, ఎస్.జయమ్మ, స్వాతి, ఎం.కృష్ణవేణి, నాగమణి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆలయాలు మూత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

చంద్ర గ్రహణం నేపథ్యంలో జిల్లాలోని ఆలయాలన్నీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అధికారులు మూసివేశారు. ప్రముఖ ఆలయాలైన అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగంతో పాటు పలు ఆలయాలన్నీ మూతపడ్డాయి. సోమవారం ఉదయం ఏడు గంటలకు సంప్రోక్షణ పూజలు చేయనున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.



అరసవల్లి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

15 నుంచి 'రణభేరి జాతా'



రణభేరి జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈ నెల 15 నుంచి 19 వరకు రణభేరి జాతా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ ఉపాధ్యాయులను కోరారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటీ పరిష్కారం కాలేదని అన్నారు. ప్రధానంగా ఆర్థిక విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోగా, మరింత జటిలంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని చెప్పారు. మూడు నెలలుగా ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు లేవని అన్నారు. ప్రభుత్వం మారినా ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకం రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా ప్రభుత్వ విద్య వ్యవస్థ మరింత బలహీన పడుతుందని పేర్కొన్నారు. మూడో వంతు ప్రైమరీ పాఠశాలలు సింగిల్ టీచర్లు స్కూల్‌గా మారిపోయాయని చెప్పారు. సగానికి పైన హైస్కూళ్లలో సింగిల్ సబ్జెక్టు టీచర్లు పనిచేస్తున్నారని అన్నారు. స్కూల్ అసిస్టెంట్స్ సర్ఫ్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు పరిమితం చేయడం విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పే పరిస్థితి లేదన్నారు. స్కూళ్లల్లో ఉన్న సమయమంతా ఆన్‌లైన్ అప్లోడింగ్‌తోనే సరిపోతుందన్నారు. విద్యాశక్తి స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతం చేయడం అన్యాయ మన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల పనిభారం, పి-4, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్ష మూల్యాంకనం, ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్పోర్ట్ తదితర బోధనేతర పనులు పనిభారం విపరీతంగా ఉపాధ్యాయులపై మోపుతున్నారని చెప్పారు. 57 మెమో ప్రాప్తికి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న రాష్ట్రంలో బహిరంగ సభ ద్వారా యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాలన్నింటిలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రణభేరి జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు పి.సూర్యప్రకాశరావు, టి.భాస్కరరావు, బి.శంకరరావు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలికి చెందిన సీనియర్ నాయకులు బగాది శేషగిరిరావును ఇటీవల ప్రభుత్వం కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్, డైరెక్టర్లు, టెక్కలి మండల టిడిపి నాయకులు మంత్రిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు సముచిత స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి అభివృద్ధికి అహర్నిశలు పనిచేసే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు భరోసా

పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయనిధి చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు రూ.2,69,748 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంలా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యమే సమాజ భవిష్యత్‌కు పునాది

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: బాలికల ఆరోగ్యమే సమాజ భవిష్యత్‌కు పునాది అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. చిన్న వయసులోనే వారికి సరైన పరీక్షలు, అవగాహన కల్పిస్తే రేపటి తరాలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. నగరంలోని బాలికల హాస్టల్‌లో శ్రీకాకుళం ప్రసూతి, గైనకాలజిస్టుల సంఘం - ఫ్రీమాసన్స్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా చేపట్టిన పి-4 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్‌తో మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పి-4 కార్యక్రమం ద్వారా వచ్చే ఆరు నెలల్లో జిల్లాలోని 75 రెసిడెన్షియల్ హాస్టళ్లలో 12 వేల మంది బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ శిబిరంలో 98 మంది బాలికలకు అనీమియా స్క్రీనింగ్, రక్తగ్రూప్ పరీక్షలు, గైనకాలజీ వైద్య పరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్ రికార్డింగ్ నిర్వహించారు. అదనంగా వ్యక్తిగత శుభ్రత, పీరియడ్స్ సమయంలో శుభ్రతపై నిపుణులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్ బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్‌సి వసతిగృహంలో కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలు నాటారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత, డిసిహెచ్ఎస్ కళ్యాణ్ చక్రవర్తి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, గైనిక్ విభాగ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ అరవింద్, డాక్టర్ పార్వతీ, డాక్టర్ హారిక పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం

● మూఢనమ్మకాలు విడనాడాలి ● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జి.మురళీధర్



మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర నాయకులు మురళీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మూఢ నమ్మకాలు విడనాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ కమిటీ సభ్యులు జి.మురళీధర్ పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక (జెవివి) జిల్లా మహాసభలు నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జెవివి జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. జెవివి పతాకాన్ని వ్యవస్థాపక కార్యదర్శి కొత్తకోట అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెరుగుతున్న మతతత్వ భావనలు, మూఢత్వాలు శాస్త్రీయ విద్యతోనే తొలుగుతాయన్నారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు చేసేందుకు ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాలన్నారు. రాజ్యాంగ లక్ష్యాలు, ప్రజాస్వామ్యం, లౌకికత్వం, స్వావలంబనల పరిపుష్టత కోసం కోసం ప్రజానీకాన్ని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. జెవివి సీనియర్ నాయకులు కొత్తకోట అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు, యురేకా సైన్స్ ఎక్స్‌పో, శాస్త్రీయ దృక్పథ క్యాంపెయిన్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడానికి జెవివి కృషి చేస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ చేతబడులు మూఢనమ్మకాలలని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజాసైన్స్ ఉద్యమానికి తమ సహాయ సహకారాలు అందిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి సంఘీభావ సందేశం ఇచ్చారు. విద్య, ఆరోగ్య రంగాలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అణు, థర్మల్ విద్యుత్కేంద్రాలను నిర్మించరాదని పలు తీర్మానాలు చేశారు. మహాసభలో నూతన జిల్లా కమిటీ, సబ్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెవివి జిల్లా అధ్యక్షునిగా గొంటి గిరిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి కామేశ్వరరావు, జిల్లా పాటర్న్‌గా కొత్తకోట అప్పారావు, గౌరవాధ్యక్షులుగా బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, ఎస్.సాయి శ్రీనివాసశర్మ, ఉపాధ్యక్షులుగా ఎన్.కుమారస్వామి, ఎం.వాగ్దేవి, పి.కూర్మారావు, ఎస్.సంజీవరావు, జిల్లా కార్యదర్శులుగా ఆర్.సురేష్‌బాబు, పి.గోవిందరావు, ఎల్.వి చలం, జి.ప్రకాష్, కె.శ్రీనివాస్, కోశాధికారిగా వి.ఎస్ కుమార్, ఆడిట్ కన్వీనర్‌గా బి.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు.

అందుబాటులో 1600 మెట్రిక్ టన్నుల యూరియా

● వారం రోజుల్లో మూడు వేల మెట్రిక్ టన్నులు రాక
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సంతబొమ్మాళి : రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, సంతబొమ్మాళి

జిల్లాలో ప్రస్తుతం 1600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మరో వారం రోజుల్లో మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు పేర్కొన్నారు. తదుపరి విడత ఎరువులు వచ్చే అంచనా తేదీని గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు తెలియజేస్తారని తెలిపారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మూడు విడతలుగా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఎకరా భూమికి యూరియా మూడు మోతాదులుగా వినియోగించాలని సూచించారు. ఒక్కో మోతాదుకు 25 కిలోల చొప్పున యూరియా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, తగినంత మోతాదులో వినియోగించేందుకు యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే 9121863788 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఎరువుల వాడకంపై అవగాహన అవసరం

సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో ఎరువుల వినియోగం, నిల్వపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. కోటబొమ్మాళి మండలం తిలారులోని రైతు సేవా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వరి పంటకు ఎక్కువగా ఎరువులు వినియోగించడం వల్ల కలిగే ప్రభావాలు, సరైన మోతాదులో ఎరువులను ఎలా వాడాలో రైతులకు వివరించారు. ఎరువులను నిల్వ చేసుకునే సరైన పద్ధతులు, పంటలకు అవసరమైన మోతాదులో ఎరువులను వినియోగించడం వల్ల దిగుబడులు పెరుగుతాయని, ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పలువురు రైతులు పాల్గొని ఎరువుల వినియోగంపై తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, ఎడిఎ జగన్మోహనరావు, పిఎసిఎస్ ఛైర్మన్ కాంతారావు, ఎంపిడిఒలు జయంత్ ప్రసాద్, ఫణీంద్ర కుమార్, తహశీల్దార్లు హేమసుందర్, అప్పలరాజు, వ్యవసాయశాఖ అధికారులు ఆర్.అప్పారావు, గోవిందరావు సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో..

ఉపాధ్యాయ కొలువులు సాధించిన అన్నాచెల్లెలు

ప్రజాశక్తి- కవిటి

జీవితంలో కన్న కలలు పిల్లల భవిష్యత్‌గా మలిచే వారు నిజమైన తల్లిదండ్రులు. అటువంటి వారిలో ముందువరుసలో నిలిచారు భైరిపురానికి చెందిన పిరియా శంకరరావు. మండలంలోని భైరిపురానికి చెందిన పిరియా శంకరరావుకు ఉపాధ్యాయ వృత్తి అంటే ప్రాణం. చిన్నప్పటి నుంచే చదువు - బోధనపై మక్కువ. తపనతో ముందుకు సాగారు. దాదాపు 18 ఏళ్ల పాటు విద్యా వాలంటీర్‌గా అనేక మంది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించారు. కానీ, ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం ఆయనకు దక్కలేదు. అయినా తన కలను మాత్రం వదలలేదు. 'నేను సాధించలేకపోయినా నా పిల్లలు తప్పక ఉపాధ్యాయులుగా నిలవాలి' అన్న సంకల్పంతో బతికారు. కూతురి చదువులో ప్రతి అక్షరం దగ్గర తానే తోడుగా నిలబడి, ఏడో తరగతి వరకు స్వయంగా బోధించారు. తన కొడుకుకు మాత్రం మొదటి నుంచి శిక్షణ, దార్శనికత అందించారు. దీంతో తండ్రి కల, తపన, కన్నీళ్లు అన్నీ బలంగా గుర్తుపెట్టుకున్న ఆ అన్నా చెల్లెలు పిరియా శ్రీకర్, షర్మిల కష్టపడి చదివి, పట్టుదలతో ప్రస్తుత డిఎస్‌సిలో ఎస్‌జిటి కొలువులు సాధించారు. ఆ ఫలితం వినగానే భైరిపురం ఇంటిలో ఆనందం వెల్లివిరిసింది. జీవితాంతం తన కలకోసం తపించిన శంకరరావు కళ్లలో ఆనందభాష్పాలు ఉప్పొంగాయి. 'నా కల నా పిల్లల ద్వారా సాకారమైంది' అని కన్నీళు తుడుచుకుంటూ ఆయన ఉప్పొంగారు. తనతో పాటు నిలిచిన భార్య శ్రీదేవి ఆ క్షణాన్ని జీవితంలోకెల్లా గొప్ప బహుమతిగా భావించారు. మొత్తంగా తండ్రి కల.. పిల్లల విజయంతో సాకారమై భైరిపురం గర్వంగా నిలిచింది.



తల్లిదండ్రులతో ఎంపికైన ఉపాధ్యాయులు

అర్హులందరికీ సొంతిళ్లు

● అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలపై దృష్టి
● నిర్మాణాల దశల బట్టి బిల్లుల చెల్లింపు
● జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌ఛార్జి అధికారి అప్పారావు





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో సొంతిళ్లు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌ఛార్జి అధికారి కె.అప్పారావు అన్నారు. ఇళ్లు ఇల్లు మంజూరు నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. అసంపూర్తి ఇళ్లు పూర్తికి లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణాల దశల బట్టి బిల్లులు చెల్లింస్తున్నామని అన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు వివరాలు వెల్లడించారు.

? జిల్లాలో ఇంటి నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి

జిల్లాలో 70725 ఇళ్లు గత ఐదేళ్లలో మంజూరయ్యాయి. అంచనా విలువ రూ.1273.05 కోట్లు. ఇప్పటి వరకు 41718 ఇళు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల యూనిట్లలో వివిధ స్థాయిల్లో నిర్మాణాలు ఉన్నాయి. ప్రారంభం కానీ ఇళ్లు 1452 ఉండగా, బిబిఎల్ 13,117, పిసి 41, పిబి 557, బిఎల్ 7458, ఎల్ఎల్ 887, ఆర్ఎల్ 3185, ఆర్‌సి 2,310 దశల్లో ఉన్నాయి. వీటికి రూ.833.99 కోట్లు నిధులు చెల్లించాం. ఇంటి నిర్మాణ దశలు బట్టి బిల్లులు చెల్లింపు ఉంటుంది. పునాదులకు ఉపాధి హామీ ద్వారా బిల్లులు చెల్లింపు ఉంటుంది.

? లే అవుట్‌ల్లో ఇళ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయి?

జిల్లాలో 789 లే అవుట్లు వేశాం. లే అవుట్లలో 33,275 ఇళ్లు మంజూరు చేశాం. ప్రాజెక్టు విలువ రూ.598.95 కోట్లు. ఇందులో 11877 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రారంభం కానీ ఇళ్లు 836 ఉండగా, బిబిఎల్ 10270, పిసి 41, పిబి 235, బిఎల్ 6009, ఎల్ఎల్ 522, ఆర్ఎల్ 2192, ఆర్‌సి 1393 దశల్లో ఉన్నాయి. రూ.300.86 కోట్ల బిల్లులు చెల్లించాం.

? సకాలంలో ఇంటి నిర్మాణాలకు ఎలా కృషి చేస్తున్నారు?

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.1.80 లక్షలు ఐదు విడతల్లో బిల్లులు చెల్లింపుకు చర్యలు చేపడుతున్నాం. అదనపు సాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. బిసిలకు రూ.50 వేలు, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75 వేలు, పివిజిటిలకు రూ.లక్ష రుణాలు మంజూరుకు కృషి చేస్తున్నాం. 90 రోజులు మ్యాన్ డేస్ వేతనం ఉపాధి హామీ కింద బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంటి నిర్మాణంలో లబ్ధిదారులకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుంది.

? మౌలిక వసతులకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కాలనీల్లో రోడ్డులో, నీటి సౌకర్యం వంటివి కల్పిస్తున్నాం. జిల్లా అధికార యంత్రాంగం ఉపాధి హామీలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ రోడ్డు నిర్మాణానికి సైతం కృషి చేసింది. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

? లబ్ధిదారులు ఎంపిక ఎలా ఉంటుంది?

ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇళ్లు లేని ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు ఉంటుంది. సొంత స్థలం ఉన్న వారికి, స్థలం లేని వారికి రెండు రకాలుగా మంజూరు అవుతుంది. స్థలాల అంశం ప్రభుత్వం నిర్ణయం మేరకు అమలు ఉంటుంది. గతంలో ఇళ్లు నిర్మించి బిల్లులు చెల్లించనివి సైతం చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హత ప్రామాణికంగా ఇళ్లు మంజూరు, బిల్లు అందజేస్తున్నాం.

? మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎటువంటి ప్రాధాన్యత నిస్తున్నారు?

గృహ నిర్మాణ రంగంలో మంజూరైన ఇళ్లకు రూ.15 వేలు అదనంగా మరుగుదొడ్ల నిర్మాణాలకు అందజేస్తున్నాం. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు మంజూరవుతాయి. వ్యక్తిగత పారిశుధ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుంది.


విజయలక్ష్మి ట్రేడర్స్‌లో తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

యూరియా అమ్మకాలపై ఆర్‌డిఒ ఆగ్రహం

ప్రజాశక్తి - లావేరు

మండలంలోని వెంకటాపురంలోని ఎరువుల దుకాణాలను శ్రీకాకుళం ఆర్‌డిఒ కె. సాయి ప్రత్యూష ఆదివారం తనిఖీ చేసి యూరియా అమ్మకం విధానంపై రైతులకు టోకెన్లు ఇవ్వకపోవడంపై వ్యవసాయాధికారి మహేష్ నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయలక్ష్మి ఎంటర్ ప్రైజెస్‌లో యూరియా సరఫరా చేసేందుకు రైతులు పేర్లు జాబితా లేకుండా వుండం, టోకెన్లు ముందస్తుగా ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ దుకాణం పరిధిలోని రైతుసేవాకేంద్రం పరిధిలోని రైతుల పేర్లు జాబితా దుకాణంలో వుండి ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి వీఆర్‌ఒ, వీఆర్‌ఎలు దగ్గర ఉంచి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా ఇవ్వాలని ఆదేశించారు. పంపిణీని తహశీల్దార్, ఎఒలు పర్యవేక్షించాలని ఆదేశించారు. విజయలక్ష్మి ట్రేడర్స్ 660 బస్తాల యూరియాను సక్రమంగా రైతులకు సరఫరా చేయాలని చెప్పారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ జివిఎల్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఆర్‌ఎస్ డిటి రాపర్తి అప్పలరాజు తదితరులున్నారు.


మృతురాలి తల్లిదండ్రులను విచారణ చేస్తున్న డిఎస్‌పి వివేకానంద

ఆత్మహత్య కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని చిట్టివలసలో వరకట్న వేధింపుల ఆత్మహత్య కేసుపై శ్రీకాకుళం డిఎస్‌పి సి.హెచ్ వివేకానంద్ ఆదివారం విచారణ చేపట్టారు. ఇటీవల నవిరి సింహాచలం, పద్మ దంపతుల చిన్న కుమార్తె పూర్ణ అత్తమామలు, భర్త వేధింపులు భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో డిఎస్‌పి మృతురాలి తల్లిదండ్రులను విచారించి వివరాలు సేకరించారు.

వరకట్నంగా ఇచ్చిన ఆస్తులు

పూర్ణ వివాహ సమయంలో రూ.5 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, 50 సెంట్లు భూమి, రూ.2 లక్షల విలువైన సారెసామాన్లు ఇచ్చినట్లు తల్లిదండ్రులు డిఎస్‌పికి వివరించారు. అయితే అత్తింటి వారు మరో 50 సెంట్లు భూమి తీసుకురావాలని రోజూ వేధించేవారని తెలిపారు. పెళ్లైన నాలుగు నెలల్లోనే ఇలాంటి పరిస్థితులు రావడం తమను తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు.

భర్త వేధింపుల వల్లే...

కొన్ని రోజులు సమయం ఇస్తే తల్లిదండ్రులకు నచ్చజెప్పి భూమి తీసుకువస్తానని పూర్ణ చెప్పినా, భర్త మధుసూదనరావు తక్షణమే భూమి తీసుకురాకపోతే విడిచిపెడతానని బెదిరించి శారీరక, మానసిక వేధింపులకు గురి చేశాడని మృతురాలి తల్లిదండ్రులు వాపోయారు. ఈ కారణంగానే తమ కుమార్తె మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకుందని వివరించారు. డిఎస్‌పితో పాటు ఎస్ఐ సనపల బాలరాజు, సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు గ్రామస్తులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆక్వా రైతు సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నరసన్నపేట

ఈ నెల 11న విజయవాడలో నిర్వహించనున్న ఆక్వా రైతుల సదస్సు విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యలమల రమణ, కరగాన కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని అంపలాంలో వై.దర్శారావు, ఉప్పాడ అప్పలరెడ్డి ఆధ్వర్యాన ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కౌంట్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా రైతులను గిట్టుబాటు ధర కొనుగోలుకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ్, విదేశీ ఎగుమతులపై అమెరికా 50 శాతం పన్నులు విధించడం దారుణమన్నారు. జిల్లాలో సుమారు 8000 ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయని, వీటిపై ఆధారపడి పది వేల మంది జీవిస్తున్నారని తెలిపారు. అమెరికా విధించిన సుంకాలపై టిపికొట్టలన్నారు. ఆక్వా రంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించాలని, రైతులు, రైతు సంఘాలు ప్రతినిధులతో సమస్యలపై చర్చించాలని అన్నారు. మార్కెట్ యార్డుల్లో చేపల గిడ్డంగులో నిర్మించి రైతాంగానికి అందుబాటులో తేవాలని డిమాండ్ చేశారు. మొత్తం ఉత్పత్తిలో 70 శాతం ఎగుమతుల్లో 60 శాతం మన రాష్ట్రం నుంచే అవుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకనాయుడు, గిరిబాబు, వెంకటరమణ, రామారావు, రాము పాల్గొన్నారు.

75 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పోలాకి: విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి, శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఆదివారం నేత్రాస్పత్రి నిర్వహించారు. ఈ మేరకు 75 మందికి నేత్ర వైద్య పరీక్షలు ఆదివారం నిర్వహించారు. అందులో 45 మందికి నేత్ర ఆపరేషన్ అవసరం నిమిత్తం బస్సులోకి తరలించారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ సాంబశివరావు, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య సిబ్బంది దీపక్, అనిత, క్యాంప్ మేనేజర్ అప్పలరాజు, క్యాంపు కో-ఆర్డినేటర్ సాయికుమారు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - లావేరు


మాట్లాడుతున్న కళావెంకటరావు

గత వైసిపి ప్రభుత్వంలో అవినీతి విలయతాండవం చేసిందని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆదివారం లావేరు పంచాయతీ కేశవరాయ పురంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీఛైర్మన్ యినపకుర్తి తోటయ్య దొరను పరామర్శించారు. ఆయనకు ఇటీవల చేతికి శస్త్రచికిత్స జరగడంతో ఆయన్ని పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖపట్నంలోని రుషికొండను బొడిగుండుగా మార్చి రూ.450 కోట్లు ప్రజాధనం ఖర్చు పెట్టి కట్టిన భవనాలు పేలెస్‌లు అంటారా కాదా అన్నారు. అక్కడ వుండే పర్యాటక పాత భవనాలు ద్వారా ఆదాయం వచ్చేదని, వాటిని కూలగొట్టి కొత్తగా ప్యాలెస్‌లు ఎవరి కోసం నిర్మించారో వైఎస్ జగన్మోహన్ రెడ్డి బొత్స సత్యనారాయణలు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రైతులు, పేద బడుగు బలహీన వర్గాలు, అన్ని వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ సర్పంచ్ మాకన శంకర్రావు, మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాధ్, కూటమి నాయకులు ఉన్నారు.



ప్రాణాలు తీస్తున్నా.. పట్టించుకోరా?

- స్వైరవిహారం చేస్తున్న కుక్కలు
- ప్రాణాలు కోల్పోతున్న పశువులు
- చిన్నారులకు తప్పని ముప్పు
- పొంచి ఉన్న రేబిస్

ప్రజాశక్తి - కవిటి

శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో గుంపులుగా తిరుగుతూ ప్రజలని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన బండారు దశరథరావుకి చెందిన 4 మేకలు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోగా, అదే గ్రామానికి చెందిన యాంద్రాపు శివ కుమార్తె (4 ఏళ్లు) కుక్కల దాడి నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడింది. కొంచెం ఆలస్యమైతే ఆ చిన్నారి ప్రాణాలకే ప్రమాదం. ఇది కేవలం వీరిద్దరి సమస్య మాత్రమే కాదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్య.

పెరుగుతున్న ప్రమాదాలు

ఇటీవల కాలంలో కుక్కలు అకస్మాత్తుగా దూసు కొస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారు. వీరిలో చాలామంది ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసు కుంటుంటే చాలా సందర్భాల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో శస్త్ర చికిత్సలు తప్పనిసరి అవుతున్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది.

ప్రాణాలు కోల్పోతున్న మూగ జీవాలు

గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల దాడిలో ఇటీవల కాలంలో పశువులు, మేకలు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు పదుల సంఖ్యలో ఉంటున్నాయి. ముఖ్యంగా చూడు ఆవులు, లేగ దూడలను కుక్కల బారినుండి కాపాడుకోవడం పాడిరైతుకు తలకు మించిన భారంగా మారుతోంది. మరో వైపు మేకల పెంపకం దారులు కుక్కలతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల చాలా గ్రామాల్లో కుక్కల దాడిలో పదుల సం ఖ్యలో మేకలు ప్రాణాలు కోల్పోయాయి.

చిన్నారులకు తప్పని ముప్పు

ఇక ఇటీవల కాలంలో కుక్కల దాడికి గురైన అనేక మంది చిన్నారుల హృదయవిదారక సంఘటనలు అనేకం. వీధిలో ఆడుకుంటున్న, పాఠశాలలకు, గ్రామాల్లో షాపులకు వెళ్లే పిల్లలు కుక్కల బారిన పడుతున్నారు. కుక్కల సంఖ్య లెక్కకు మించి పెరిగిపోవడంతో అవి ఆహారం కోసం విచ్చలవిడిగా దాడులు చేస్తున్నాయి. ఇటీవలే ప్రగడపుట్టుగకు చెందిన ఓ చిన్నారి కుక్కల దాడి నుంచి తృటిలో తప్పించుకుంది. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనతో తమ పిల్లల్ని బడికి, బయటకు పంపిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో గ్రామాల్లో రేబిస్ ముప్పు పొంచి ఉంది. కుక్కల సంఖ్యపై నియంత్రణ లేకపోవడంతో చాలా కుక్కలు వ్యాధులతో పోరాడుతున్నాయి. అటువంటి కుక్కలు దాడిచేసినా, వీధుల్లో ఎక్కువగా సంచరించినా రేబిస్ ముప్పు తప్పదు. ఇటువంటి పరిస్థితుల్లో జంతు ప్రేమికులు వీధికుక్కల సంరక్షణ అవసరమని చెబుతుండగా, గ్రామీణ ప్రజలు తమకు ప్రాణరక్షణ కావాలని అంటున్నారు. మరోవైపు పాడి రైతులు, చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర అభద్రతాభావంతో జీవిస్తున్నారు.

ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి

ఇటీవల కుక్కల దాడిలో నేను పెంచుకున్న నాలుగు మేకలు చనిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు ప్రమాదకరంగా మారుతున్నాయి. చిన్నారులే కాదు రైతులు ఒంటరిగా తోటకి వెళ్లాలన్నా భయంగా ఉంది. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదు. ఇటీవల కాలంలో చాలా మేకలు, పశువులు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయాయి. కానీ, ఒక్క అధికారి బాధితులకు భరోసా ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి అటు పశువులు, ఇటు మనుషులకు రక్షణ కల్పించాలి.

- బండారు దశరథరావు, బాధితుడు, ప్రగడపుట్టుగ


వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

పట్టించుకున్నవారేరి?

ఇంతటి ప్రమాదం పెరిగిపోతున్నా, అధికార యంత్రాంగం మాత్రం నిశ్శబ్దంగా ఉంది. పశువులు చనిపోతున్నా, చిన్నారుల ప్రాణాలు ముప్పులో పడుతున్నా, రేబిస్ ముప్పు పొంచి ఉన్నా 'మాకేం సంబంధం?' అన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో కుక్కలతో పోరాడే పరిస్థితి వస్తుందేమో? అని మనిషి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

ఇటీవల కాలంలో మండలంలో పశువులపై కుక్కల దాడి చేసిన ఘటనలు మా దృష్టికి వచ్చాయి. గ్రామాల్లో కుక్కల తీవ్రతను ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీనివాస రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ

ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటోంది



ఇటీవల కాలంలో కుక్కలు, పశువుల వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉంటోంది. అకస్మాత్తుగా జరుగుతున్న ఈ ప్రమాదాలు కొన్నిసార్లు ప్రాణాంత కాలుగా కూడా మారు తున్నాయి. అదే సమయంలో కుక్కలు, పశువుల వల్ల వాహనదారులకు జరుగుతున్న ప్రమాదాల్లో శస్త్ర చికిత్సలు కూడా తప్పనిసరి అవుతున్నాయి.

- డాక్టర్ చమల్ల ఫాల్గుణదీప్
ఎంబిబిఎస్, డి ఆర్థో, డి.ఎన్.బి ఆర్థో
కన్సల్టెంట్ ఆర్థో ఫిజీషియన్,
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్


మంత్రికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

ఎక్సైజ్ మంత్రి అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని ఆదివారం ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, ఆలయ అర్చకులు మంత్రికి ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాధాన్యతను అర్చకులు వివరించారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని బొరివంక, మాణిక్యపురం 11కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనులు నిమిత్తం సోమవార ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంక, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగాన పుట్టుగ, కొర్రాయిపుట్టుగ, మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక, కుసుంపురం గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగ దారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వైసిపి నాయకులు, మాజీ సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వైసిసి రాష్ట్ర కార్యదర్శి నియమితులయ్యారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల పరిశీల కులుగా సమన్వయం చేసుకునేందుకు నియమి ంచారు. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ... సంబంధింత రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారు. తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన పదవికి తగిన న్యాయం చేస్తూ... వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ మేరకు మాజీ సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తూరు ఆరోగ్య కేంద్రం

ఆస్పత్రిలో సిబ్బంది కొరత

ప్రజాశక్తి - కొత్తూరు

అటు ఒడిశా, ఇటు ఆంధ్ర కేంద్రంగా పనిచేస్తున్న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తుంది. దీంతో రోగులకు ఆరోగ్య సేవలు దూరమనే చెప్పాలి. ఈ ఆరోగ్య కేంద్రం సుమారు లక్ష జనాభాకు ఆధారం. హడ్డుబంగి, కాశీనగర్ బ్లాక్‌లతో పాటు పలు గ్రామాలకు చెందిన రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. అలాగే పార్వతీపురం జిల్లా సీతంపేట, భామిని మండలాలకు చెందిన రోగుల కూడా ఈ ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. ఈ ఆరోగ్య కేంద్రంలో మొత్తు వైద్యుడు తప్ప ఇతర వైద్యులు కొరత వేధిస్తుంది. పది మంది నర్సులు అవసరం. హెడ్ నర్సుతో కలిపి ఏడుగురు ఉన్నారు. వీరు మూడు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం నిత్యం రోగులతో తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజూ మూడు వంది అవుట్, 50 మంది ఇన్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతూ ఉంటారు.

పేదల ఇళ్లపై కక్షతో వైసిపి అడ్డంకులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పేదలకు గూడు కల్పించడమే టిడిపి లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 1వవార్డు పరిధిలోని జగ్గుశాస్త్రులపేటలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2016-17లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఇళ్లులేని లబ్ధిదారులకు 528 పక్కా గృహాలు మంజూరు చేసిందని, నిధులు కేటాయించి 80 శాతం మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేసిందన్నారు. 2019లో అధికారం లోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పేదల ఇళ్లపై కక్షతో నిధులు ఇవ్వకపోగా నిర్మాణాలను అడ్డుకుందన్నారు. 2024 ఎన్నికల ముందు వైసిపి హడావుడిగా మసిబూసి మారేడుకాయలా పనులు చేసి మౌలిక వసతులు లేకుండా పేదలకు ఇళ్లు ఇస్తున్నట్లు నాటకం ఆడిందని ఎద్దేవా చేశారు. టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్ల హక్కు పత్రాలను ఇచ్చి పేదలకు పక్కా గృహాలను అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు సంపద రావు మురళి, పివివికె రాజు, మొదలవలస హర్ష, బోయిన సునీత, పాతిన రమణ, మున్సిపల్ సిబ్బంది, టిడ్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.


టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

బిజెపి అనుసరిస్తున్న మతతత్వ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే సీతారాం ఏచూరికి అర్పించిన నిజమైన నివాళి అని వక్తలు అన్నారు. మండలంలోని బెండి శాఖ ఆధ్వర్యాన సిపిఎం అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కోర్నాన బాలాజీరావు, తమ్మినాన భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన సహకారం అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు అవసరం లేని ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. విద్యుత్ సంస్కారణలలో భాగంగా స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే నగరంపల్లిలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఏచూరి వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో కె.వెంకటరావు, కె.కృష్ణారావు, ఎం.రమేష్, కె.కనకారావు, డి.తెల్లవాడు, డి.హరికృష్ణ, యు.గంగ, కె.సంతోషి, కె.లక్ష్మి, టి.లక్ష్మి, ఎస్.రజని, డి.సోములు, ఎస్.రమణమ్మ, డి.సావిత్రి పాల్గొన్నారు.

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఈ నెల 9న ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు రైతన్నకు బాసటగా వైసిపి నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల కొరత వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టిడిపి నాయకులు బ్లాక్ మార్కెట్‌లో ఎరువులను విక్రయించి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ఎరువులు రైతులకు సక్రమంగా అందేలా వైసిపి వారి పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు అత్తులూరి రవికాంత్, దుంపల శ్యామలరావు, కొడుకు శ్రీనివాసరావు, పొన్నాడ చిన్నారావు, కొప్పల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : ఈ నెల 9న స్థానిక అంబేద్కర్ కూడి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నామని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. ఈ మేరకు అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్

కవిటి: రైతన్నలకు బాసటగా అధినేత పిలుపు మేరకు ఈ నెల 9న నిర్వహించనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమం విజయవంతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యాక్షుడు రాంపత్ని చిట్టిబాబు ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి, వారికి సకాలంలో నాణ్యమైన ఎరువులు అందించడమే కాకుండా బ్లాక్ మార్కెట్ నియంత్రించి, ఉచిత పంటల బీమా వెంటనే పునరుద్ధరించి, వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు తక్షణమే ఇన్ పుట్ సబ్సిడీ అందించడమే తమ అన్నదాత పోరు ప్రధాన లక్ష్యమని తెలిపారు.


'ఐతమ్'కు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో 201 నుంచి 300 బాండ్ ర్యాంకింగ్‌గా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఇండియా ధర్మేంద్ర ప్రదాన ప్రకటించినట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025కు సంబంధించి, విభజించిన ర్యాంకుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వచ్చిన మూడు కళాశాలల్లో ఐతమ్ ఉందని అన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎనిమిది కళాశాలలు ఈ ర్యాంకింగ్‌ల్లో ఉన్నాయని అన్నారు. అందులో ఐతమ్ కళాశాల ఒకటని అన్నారు. కళాశాలలోని నిష్ణాతులైన అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిభ, ఉపాధి అవకాశాలు, అధ్యాపకుల పరిశోధనలు, ఆధునిక ల్యాబ్ సదుపాయాల ప్రాతిపదికన ఈ ర్యాంకింగ్‌లు ఎంపిక చేస్తారని తెలిపారు. డైరెక్టర్‌తో పాటు చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.



ఐతమ్ కళాశాల


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు తదితరులు

బెజ్జిపురం మండల సాధనకు ఉద్యమించాలి


ప్రజాశక్తి - లావేరు

బెజ్జిపురం మండల కేంద్రంగా ఏర్పాటుకు ప్రజలంతా ఉద్యమించాలని బెజ్జిపురం మండల సాధనసమితి సభ్యులు అన్నారు ఆదివారం ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ యార్డులో బెజ్జపురం మండల సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బెజ్జపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు మేడూరి ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. 12 గ్రామ పంచాయతీల సభ్యులు పాల్గొన్నారు. బెజ్జిపురం మండల ఏర్పాటుకు పంచాయతీల వారీగా అభిప్రాయలను వెల్లడించారు. లక్ష్మీపురం, తామాడ, బుడతవలస, గుమ్మడాం, అదపాక, సిగిరు కొత్తపల్లి పంచాయతీలకు చెందిన వారు బెజ్జిపురం మండల సాధనకు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. కొత్తకుంకం, పాతకుంకాం, గుర్రాలపాళెం పంచయతీల వారు గ్రామస్తులతో మాట్లాడి తమ అభిప్రాయం తెలుపుతామని చెప్పగా పెద్దకొత్తపల్లి, పైడాయవలస, చిన్నరొంపివలస పంచాయతీల వారు గైర్హాజరయ్యారు. బుడుమూరు పంచాయతీ నుంచి యువజన సంఘం సభ్యుడు గారబుడ్డ కనకరాజు మాట్లాడుతూ తాము బుడుమూరు మండల కేంద్రం ఏర్పాటు సాధనకు ఇప్పటికే కృషి చేస్తున్నామని అందరూ మద్దతు పలకాలని, విభిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం బెజ్జిపురం మండల సాధన కోసం భవిష్యత్‌లో శాంతియుత ర్యాలీలు, నిరసనలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని కార్యాచరణ తయారు చేయాలని నిర్ణయించారు. సాధనసమితి సభ్యులు ఎం.ప్రసాదరావు, దన్నాన రాజీనాయుడు, శ్రీనువాసరావు, మధుబాబు, గొర్లె అప్పలనాయుడు, శివన్నారాయణ, బొంతు సూర్యానారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - లావేరు

విద్యార్థులు క్లాస్ పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయానికి వచ్చి రకరకాల పుస్తకాలు చదువుకోవచ్చునని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ప్రయోగాత్మకంగా లావేరు శాఖా గ్రంథాలయ ఆవరణలో జాతీయ నాయకుల తైల చిత్రపటాలను ప్రతి విద్యార్థికి ఇచ్చి వారి జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయం అలవాటు చేసుకోవాలని, ప్రతి ఆదివారం విద్యార్థులకు సెలవు దినం కాబట్టి గ్రంథాలయానికి వచ్చినట్లయితే విద్యార్థి కోరుకునే పుస్తకాన్ని తాము అందిస్తామన్నారు. తొలుత విద్యార్థులకు యోగా క్లాస్ నిర్వహించి వివిధ ఆసనాలు విద్యార్థులతో వేయించారు. గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రోడ్డు మరమ్మతులు చేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఫరీదుపేట గ్రామానికి వెళ్లే తారురోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు ఏర్పడ్డ చిన్నచిన్న గోతుల వలన వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. స్పందించిన శ్రీ రంగనాథ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు రోడ్డు మరమ్మతులు చేశారు. తారు కలిపిన పిక్కను తెచ్చి వారే స్వయంగా గోతులు పూడ్చారు. వీరి సేవా దృక్పథాన్ని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతినిధులు అన్నెపు గోవిందరావు, అన్నెపు కృష్ణారావు, పైడి కృష్ణారావు, పప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న లోక్‌సత్తా నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పీపుల్ ఫర్ లోక్‌సత్తా అధ్యక్షులు ప్రకాష్ కపిల అన్నారు. నగరంలోని అంబేద్కర్ మందిరంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుమేరకు ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పర్యావరణ ధ్వంసం వల్ల అనేక సమస్యలు భవిష్యత్‌లో వస్తాయన్నారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు పంచాది రాంబాబు మాట్లాడుతూ రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో మొక్కలు విస్తారంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువతలో అవగాహన అవసమన్నారు.

'హెల్పింగ్ హేండ్స్' ఔదార్యం

కవిటి: బొరివంక కేంద్రంగా పనిచేస్తున్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ మరోసారి తన ఔదార్యం చాటుకుంది. పక్షవాతంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన శివాలయం పూజారి ప్రసాద్‌కు అండగా నిలిచి ఆదుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసాద్ పెరాలసిస్‌కు గురై మంచానికే పరిమితమయ్యాడు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం గడవడం కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యుడు కాశీ సాహు తమ సంస్థ ద్వారా రూ.5500లు, నెలకు సరిపడే నిత్యావసర సరుకులు తమ సభ్యులతో కలిసి అందించాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన కిరణ్ తనవంతుగా ఒక బియ్యం బస్తా ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందించాడు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ సమస్యలతో సతమతమవుతున్న ప్రసాద్ కుటుంబానికి దాతలు అండగా నిలవాలని కోరారు.


ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందిస్తున్న సభ్యులు


అధ్వానంగా మారిన ఆంపురం రోడ్డు

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గిరిజన రహదారులు దారుణంగా తయారయ్యాయి. ఏ చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా కనిపిస్తున్నాయి. రహదారులు అభివృద్ధి లేక దారుణంగా తయారయ్యాయి. ఎన్నాళ్లీ అవస్థలని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. నేలబొంతు రోడ్డు నుంచి గొట్టిపల్లి రహదారి, గొడ్డ నుంచి ఆంపురం, పెంగువాడ వెళ్లే రహదారి, చింతపల్లి రహదారి, భరణికోట జక్కర వీధి, జన్నివీధి, కాటం వీధి, రహదారులు దుర్భరంగా తయారయ్యాయి. ఈ గ్రామాలకు నడిచి వెళ్లాలంటే చెప్పులు చేతపట్టి నడుచుకొని వెళ్లాల్సి వస్తోందిన గ్రామస్తులు అంటున్నారు. గ్రామ రహదారుల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధుల స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా కూటమి ప్రభుత్వం గిరిజన రహదారులపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

విప్‌కు సన్మానం

ఇచ్ఛాపురం : కూటమి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 11 కార్పొరేషన్ డైరెక్టర్లలో ఇచ్ఛాపురానికి ఎపి నాటక అకాడమీ డైరెక్టర్‌గా లభించాయి. ఈ సందర్భంగా ఆదివారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్, నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావుకి టిడిపి మండల నాయకులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, మెరుగు సూర్యనారాయణరెడ్డి, సాడి సహదేవ్‌రెడ్డి, దక్కత ఢిల్లీరావు, బోర ప్రసాద్, చంద్ర శేఖర్‌రెడ్డి, లోహిదాసు, కాళ్ల గోపి, కోట రామారావు, సాడి ఢిల్లీ, దక్కత రామారావు, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

'తెప్పల'కు తెరవే పురస్కారం

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం కిల్లాన కాంప్లెక్స్‌లో తెలుగు రచయితల వేదిక 108వ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన కవి సమ్మెళనం దుప్పల రవికుమార్ సంకలనంలో ముద్రితమైన ముంజూరు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. పలాస జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గురుదేవోభవ అంటూ కవితా గానం చేశారు. కృష్ణమూర్తిని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ, డాక్టర్ నిక్కు అప్పన్న, కిల్లాన శ్రీనివాస్, ఉపేంద్ర శర్మ, ఇద్దు పాపయ్య దుశ్శాలవ, పుస్తకతంతో సత్కరించారు.

'జాతిరత్నాలు' సేవా అవార్డులు

ప్రజాశక్తి- పలాస

జాతిరత్నాల ఆశయ స్ఫూర్తికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సిఆర్‌ఎఫ్) రాష్ట్ర కన్వీనర్, పలాస ఆర్‌టిసి డిపో సెక్యూరిటీ అధికారి డాక్టర్ గురుగువెల్లి దామోదరరావు అన్నారు. విశాఖపట్నం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యాన 'దన జాతిరత్నాల సేవా అవార్డులను విద్యార్థులకు, వివిధ సేవా రంగాల్లో పని చేసిన వారికి శనివారం రాత్రి అందించారు. శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ బెందాళం వరలక్ష్మి,కో-కన్వీనర్ ఎల్.గోవిందరాజులు, చిన్నారావు తదితరులకు అందించారు.

లడ్డు వేలం పాట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో గిలాయి వీధి, సింధీరు వీధి యువత ఏర్పాటు చేసిన వినాయకుడిని శనివారం రాత్రి నిమజ్జనం చేశారు. ఈ నేపథ్యంలో లడ్డును వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో మెండ అప్పలనాయుడు, భారతి దంపతులు రికార్డు ధరలో దక్కించుకున్నారు. డిఎస్‌కె యూత్ గిలాయి వెంకట్రావు, మరిడి ప్రసాద్, గంటా సురేష్, సిందిరి వీధి కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన లడ్డును రూ.77 వేలుకు దర్కించుకున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మోహనరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఎరువులను సమయానికి, సరైన ప్రమాణాల్లో వాడితే పంటల దిగుబడి మెరుగవుతుందని పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎఒ ప్రభావతి స్పష్టం చేశారు. మండలంలోని కోసమాలలో ఆదివారం రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎరువుల సరైన వినియోగం, మోతాదులు, పద్ధతులు తదితర అంశాలపై వివరంగా తెలియజేశారు. అలాగే, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎరువుల వివరాలనూ వివరించారు. రైతులు అందుబాటులో ఉన్న వ్యవసాయ సాంకేతిక సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రైతులకు మెరుగైన పంటల ఉత్పత్తికి అవస రమైన విషయాలపై అవగాహన కల్పించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు, వనజాక్షి, సుబ్బారావు, ధర్మారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జ్ఞానభారతి విద్యార్థి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిబిఎస్ఇ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జ్ఞానభారతి పాఠశాల విద్యార్థి అఖిల్ యాదవ్ ఆదివారం తరలి వెళ్లాడు. ఇటీవల సిబిఎస్ఇ క్లస్టర్-7 జావిలెన్‌త్రో క్రీడా పోటీలో 11వ తరగతి చదువుతున్న అఖిల్ యాదవ్ ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి 13 వరకు ఉత్తం ప్రదేశ్ వారణాసిలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించ నున్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి అఖిల్ యాదవ్‌తో వ్యాయామ ఉపాధ్యాయుడు రామచంద్ర వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్య నిర్వాహణాధికారి జోహార్‌ఖాన్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెచ్‌ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌ఫోర్టు మేనేజర్ అలీమ్‌ఖాన్ పాల్గొన్నారు.


అఖిల్ యాదవ్‌ను అభినందిస్తున్న జోహార్‌ఖాన్



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

బివికె విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన నంద్యాలలోని శారదా విద్యాలయంలో గణిత విజ్ఞాన మేళా, సంస్కృతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో బివికె విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో గర్వకారణంగా నిలిచారు. మన సంస్కృతి, పురాణాలపై నిర్వహించిన సంస్కృతి బోధ పరియోజనలో శిశు వర్గానికి చెందిన బి.లయ, బి.నందిక, జి. ప్రణవ్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. కథ-కథనం విభాగంలో విద్యార్థిని ప్రణీత తన అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు, దాశప్ప, జానకిరామయ్య, ప్రధానాచార్య మార్పు అనిల్, సంస్కృతి బోధ ప్రముఖ్ శిరీష, సుహాసిని, జ్యోతి, కృష్ణకుమార్, ఢిల్లీరావు, అంజలి, లక్ష్మి, ఝాన్సీ, మాదికమ్మా, సరిత, నిర్మల, ధర్మారావు, రాజేశ్వరి అభినందించారు.

చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం 42 ఏళ్లకు తాము చదువుకున్న పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. తమకు చదువులు నేర్పించిన గురువులు దాశరథి, బమ్మిడి సుబ్బారావు, సూర్యనారాయణ, ఫ్రాన్సిస్ మాస్టారులను ఘనంగా సత్కరించారు. చిన్ననాటి మిత్రులు కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. చిన్ననాటి మిత్రులు కలుసుకొని ఒకరినొకరు అలింగనం చేసుకొని యోగ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాల అందించి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సహచర విద్యార్థి జామి శ్రీనివాస్‌కు కళానిధి అవార్డు రావడంతో ఘనంగా సన్మానించారు. ప్రముఖ వ్యాపారి కె.వి.గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎ.సత్యారావు, త్రిపాఠి, సురేష్‌కుమార్, పెంట గణేష్, తాలాసు కాంతారావు, యోగేశ్వరరావు, రోనంకి రమణ, అరుణ కుమారి, అనురాధ, ధాత్రి, శైలజ, వసంత పాల్గొన్నారు.


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

డిజెకు చెక్

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కె.కపాసుకుద్దిలో ఆదివారం గ్రామస్తులు సమావేశమై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా వినాయక చవితి, దసరా, వివాహాలు వంటి శుభకార్యాల్లో డిజె సౌండ్ సిస్టమ్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. ఎవరు డిజె ఏర్పాటు చేసినా వారికి రూ.లక్ష జరిమానాతో పాటు పోలీస్ కేసు నమోదు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే గ్రామంలో నిర్వహించే శుభాశుభ కార్యక్రమాల్లో ప్రతి కుటుంబ సభ్యుడూ తప్పనిసరిగా పాల్గొనాలని నిర్ణయించారు. గ్రామ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేకంగా గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవడంలో ఆటంకం లేకుండా అందరికీ సమానంగా అందేలా చూడడం కమిటీ బాధ్యతగా నిర్ణయించారు. ఈ నిర్ణయాలను గ్రామ పెద్దలు, ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు, గ్రామ పెద్దలు తోట ధర్మరాజు, రామలింగేశ్వర యువజన సంఘ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మరాజు


విద్యా కిట్లు అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యార్థులకు మెమోరియల్ స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

తల్లిదండ్రుల ఆశయాలను సజీవంగా ఉంచడం గొప్పతనమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన స్వర్గీయ బెవర ముకుంధరావు, జయలక్ష్మి, కొరికాన అనంత గోవిందరావు మెమోరియల్ స్కాలర్‌షిప్‌లు, విద్యాసామగ్రిని పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో శాసపు జోగినాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్, స్టార్‌వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గేదెల లక్ష్మీ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వ్యక్తి లింగరాజు

ప్రజాశక్తి- పోలాకి

విద్యా వ్యవస్థలోనే ప్రఖ్యాత గాంచిన గొప్ప వ్యక్తి తలగాన లింగరాజు అని ఎమ్మెల్యే రమణమూర్తి కొనియాడారు. మండలంలోని ఈదులవలస కూడలి వద్ద ఉన్న కళ్యాణ మంటపంలో ఎంఇఒగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కొద్దికాలం విధులు నిర్వహించిన నిజాయితీ, అంకితభావంతో పనిచేసే వ్యక్తిగా మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత డిఇఒ తిరుమల చైతన్య, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, సొసైటీ చైర్మన్ భైరి భాస్కరరావు, స్థానిక సర్పంచ్ మజ్జి రవణమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంఇఒ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న స్థానికులు

డ్రైనేజీపై ర్యాంపు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

తుమ్మావీధిలో మురుగు నీటి కాలువలపైన ర్యాంపు ఏర్పాటు చేయాలని పట్టణ పౌర సంక్షేమ వేదిక టౌన్ కన్వీనర్ ఎం.గోవర్ధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోరుతూ తుమ్మావీధి మురుగుకాలువ వద్ద ఆదివారం స్థానిక ప్రజలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న తుమ్మావీధి వద్ద ఉన్న పలకలు పూర్తిగా పాడైపోయి, మురుగు నీరు ప్రవహించేందుకు ఆటంకంగా ఉందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.రమణారావు, కె.శ్రీనివాసరావు, ఎం.వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

రాజేశ్వరరావుకు సన్మానం

నరసన్నపేట: వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా మాజీ డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఇటీవల ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం సన్మానించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అధిష్టానం నాకు ఈ బాధ్యతలు అప్పగించిందన్నారు. శతశాతం కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.